

మానవతా! చిరంజీవ!

శ్రీకంఠస్ఫూర్తి

పల్లిపేట జంక్షనులో సరిగ్గా పదకొండు గంటలకు బస్సు దిగాడు మూర్తి. అలసిపోయిన శరీరం.... అంతకుమించిన చికాకు– తొందర నిండిన మనసుతో సూట్‌కేస్ చేత్తో పట్టుకుని చుట్టూ చూశాడు. ఎక్కడా జనం అలికిడిలేదు. చీకటి స్వేచ్ఛగా రాజ్యమేలుతోంది. ఎంత తొందరగా గమ్యం చేరదామని ప్రయత్నించినా– అంచెలు అంచెలుగా జరిగిన ప్రయాణం అంతా ఆలస్యంగానే జరిగింది. మూర్తి అసహనంగా ముందుకు కదిలాడు. అల్లంత దూరంలో గుడిసె లాంటి ఆకారం కనిపించింది. ఆ గుడిసెలో ఏదో గుడ్డిదీపం వెలుగుతూంది. మూర్తి గుడిసెదగ్గరగా సమీపించాడు. అది గుడిసె కాదు. రాటలతో నిలబెట్టిన పాక– విశాలంగానే ఉంది. పాక ముందు భాగంలో మెట్లుమెట్లుగా నిలబెట్టిన చిన్న బల్లలమీద వరుసగా సీసాలు.... ఆ సీసాల్లో ఏవో తినుబండారాలు, జంతికలు– పిప్పరమెంటు బిళ్ళలు– ప్రక్కనే గోలీ షోడాలు....సిగరెట్ పేకెట్‌లు....మిగల ముగ్గిపోయి ఈగలు ముసురుతూన్న అరటిపళ్ళ గెల....

తను సంవత్సరం క్రితం పల్లిపేటకు వచ్చినపుడు ఈ జంక్షను అంతా అడివిలా ఉండేది. చాలావరకు చెట్లే ఉండేవి. అవన్నీ పోయి ఈ పాక, కొట్టూ ఈ మధ్యనే వెలిసినట్టున్నాయి....

"ఏయ్! ఎవరు లోపల!" మూర్తి పిలుపుతో పాక లోపల్నుంచి ఒక స్త్రీ అదురుపాటుతో బయటకొచ్చి, రవికలేని భుజాల్ని కొంగుతో కప్పుకుని "ఎవురు బాబూ! ఏటీ(కావాలి!" అంటూ అడిగింది.

"పల్లిపేట పోవడాని కిప్పుడేవైనా దొరుకుతాయా!" నలభై ఏళ్ళకు పైగా

వయస్సున్న ఆ స్త్రీముఖంలోకి ఆత్రంగా చూస్తూ అడిగాడు మూర్తి.

"నేనా రాత్రయినాది బాబూ! రిక్షాలు, గుర్రబ్బళ్ళు ఇళ్ళకెళ్ళిపోనాయి. తెల్లారి ఎలుగొత్తే కాని వూళ్ళో కెళ్ళడం కష్టవండి." ఆమె అచ్చితంగా చెప్పేసి వెనక్కి తిరిగి ఏవో సర్దుకుంటూంది. మూర్తికి ముందే తెలుసు. ఈ వేళప్పుడు వూళ్ళోకి వెళ్ళడానికి మరే వాహనం దొరకదని. అయినా యధాలాపంగా అడిగాడు. ఏమైనా ఊళ్ళోకి వెళ్ళిపోవాలి. తప్పదు.... చీకట్లో... పరుగుకోనయినా పల్లిపేట ఒళ్ళోవాలాలి ఎంత కష్టమయినా సరే! మూర్తి ఆమెను మళ్ళీ పిలిచి షోడా ఒకటి కొట్టించుకుని త్రాగాడు. చిల్లర పైసలు ఆమె చేతిలో పెట్టి- చీకటి రోడ్డు వైపు చూస్తూ-సూట్ కేస్ అందుకున్నాడు.

"ఎవురదీ?" పాక లోపల్నుంచి ఎవరిదో మగగొంతుమగతగా వినబడింది.

"ఆఁ ఎవురో పట్నంబాబు! పల్లిపేట కెళ్ళాలంట! అర్ధరాత్రికాడ బళ్ళు దొరుకు తయ్యాఁటన్నడు!" ఆమె జవాబు చెప్పింది.

"ఉండవే!" దుప్పటి కప్పుకుని ఒక్క ఉదుటన పాక లోపల్నుంచి బయటకొచ్చిందా ఆకారం. అడుగు ముందుకేస్తున్న మూర్తి ఠక్కున ఆగి పోయాడు.

"బావూ! నాకాడ రిక్షా ఉన్నాది. తవరి కిష్టవయితే కడతాను. పల్లిపేటకు పది రూపాయలవుద్దండి"-ఆ వ్యక్తి దుబ్బులా లావుగానే ఉన్నాడు. దుప్పటి బిగించి కప్పుకున్నాడు. ముఖంలో ముక్కు ముందుకు పొడుచుకొచ్చినట్లుగా ఉంది. వయసు యాభై పైనే ఉండొచ్చు. కళ్ళు లోతుగా ఉన్నాయి. గెడ్డం పెరిగి జీబురుగా ఉన్నాడు.

"సరే! రా! అయితే- రిక్షా తొందరగా తీసుకురా!" మూర్తికి ఉన్నచోటు నుండి ఎగిరి పల్లిపేటలో వాలిపోదాం అన్నంత ఆత్రంగా ఉంది.

"నీకు బుద్ధినేదా! ఈ యేలప్పుడు బేరం కెల్తన్నావు? సందకాడ్నుంచి ఒల్లెచ్చగుందని ఒకటే మూల్గుతున్నవు మరిసిపోనావా!"

"ఒల్లెచ్చగుంటే ఏటవుద్దే! పదండి బావూ! మా ఆడదట్టగే నసుగుద్ది" జీబురుగడ్డం మనిషి పాకపక్క పంచ లోంచి రిక్షాను లాగి సీటు దులిపాడు. అగ్గిపుల్ల గీసి రిక్షాకున్న కిరోసిన్ లైటు వెలిగించాడు. అదే అగ్గిపుల్లతో సగం కాల్చిన చుట్ట నంటించుకుని సంతృప్తిగా రెండు దమ్ములు పీల్చాడు. 'ఎక్కండి బావూ' అంటూ హేండిలు పట్టుకన్నాడు. మూర్తి సందేహించకుండా సూట్ కేస్ రిక్షాలో పెట్టి కూర్చున్నాడు. పాకలో ఆడమనిషి ఇంకా ఏదో గొణుగుతూనే ఉంది. రిక్షా ముందుకు కదలటంతో ఆమె గొంతు పెంచి తిట్లలోకి దిగింది. ఆమె తిట్లు

వింటూ రిక్షాని లాగుతూన్న జీబురు గెడ్డం కినుక్కున నవ్వింది....

"అదంతే బాబూ! ఒక్క పిరికిగొడ్డు... ఈ వాయసులో కూడా నన్నిడిసిపెట్టి వొక్క చనం వుండనేదంటే నమ్మండి."

మూర్తి అతని మాటలు విని ఆనందించే స్థితిలో లేడు.... ఒళ్ళంతా నజ్జునజ్జుగానూ నానా చికాగ్గానూ ఉంది...

"నీ పేరేంటి?" మూర్తి సిగరెట్ వెలిగిస్తూ అడిగాడతణ్ణి.

"నారాయణండి.... తెలిసేటోళ్ళందరూ నారీ అని పిలుత్తారండి!"

"చూడు నారాయణా! చాలా త్వరగా వెళ్ళాలి పల్లి పేట! సాధ్యమైనంత త్వరగా తీసుకువెళ్ళగలిగావా– మరో అయిదురూపాయలు ఎక్కువిస్తాను." మూర్తి తన అవసరంకొద్దీ అయిదు రూపాయలు ఆశ పెట్టాడు.

"అట్టాగే బాబూ! తమరు నిదానంగా కూకుండండి!" అయిదు రూపాయల ఆశతో తన బలాన్నంతా ఉపయోగించి రిక్షాను ముందుకు లాగుతున్నాడు నారాయణ....

చల్లటి గాలి రివ్వున వీస్తోంది. కంకరరోడ్డు. రోడ్డుమధ్య గతుకుల్లోంచి రిక్షా పడుతూ లేస్తూ ముందుకు పరుగెడుతూంది. రోడ్డుకిరుప్రైపులా నిలువెత్తు తాటిచెట్లు.... మామిడి, జీడి మామిడి తోటలు.... తోటల్లోంచి– కీచురాళ్ళ గోలపెడుతున్నాయి. ఉండుండి ఏవో పిట్టలు వింతగా అరుస్తున్నాయి. ఒకప్రక్క పొలాల్లో మిణుగుపురుగులు గుంపులుగుంపులుగా కలయతిరుగుతున్నాయి. మూర్తి రిక్షా కుదుపులకి తట్టుకుంటూ పరిసరాల్ని పరికిస్తున్నాడే తప్ప మనసంతా పల్లి పేటలోనే ఉంది.

"పల్లి పేట జంక్షనుకు ఎనిమిదిమైళ్ళ దూరంలో ఉంది. ఎలా వెళ్ళినా గంటన్నర పైగా పడుతుంది. అయినా తన అదృష్టం బావుంది– ఈ నారాయణ రిక్షా కట్టాడు. లేకపోతే ఈ చీకట్లో పడుతూ లేస్తూ పల్లి పేట ఎప్పటికి చేరగలిగేవాడో!....

నారాయణ రిక్షా దిగి ఇసకలోంచి తన బలాన్నంతా ఉపయోగించి లాగుతున్నాడు. అతడు పడుతున్న శ్రమను చూసి మూర్తి మనసు జాలితో నిండిపోయింది.

"నారాయణా! నీకెంతమంది పిల్లలు?" కేవలం నారాయణ కష్టాన్ని మరిపించడంకోసం అంటూ అతన్ని మాటల్లోకి దింపాడు.

"బాబయ్యా! మా బతుక్కి అదే దురదుష్టం! మనువయ్యినాక వొక్క నలుసు పుట్టలేదనే మా యాడది కుమిలిపోతుండాది ఎన్నో దేవుళ్ళకు మొక్కుకున్నాం! డాకటేర్లు సుట్టూ తిరిగినాం.... సివరికి దానికి నేనూ– నా కదీనూ మిగిలిపోనాం!"

"పోనీ ఎవరినన్నా పెంచుకోలేకపోయారా!" మూర్తి అనాసక్తంగానే

అడుగుతున్నాడు.

"ఎవరిత్తారు బావూ! కులపోళ్ళు మమ్మల్ని ఎలేసినారు.... మావూ దూరంగా ఎలుపొచ్చేసినాం! గవుర్మెం టోళ్ళు రెండొందలుచ్చుకుని పట్టా యిత్తే- ఆ జంక్షనుకాడ పాకేసుకున్నాం! ఇంట్లో నా యాడది పొదుపుగుంది, కాళ్ళ కడియాలమ్మి కొట్టెట్టినాది. నా సేతిలో రిక్షా.... రెక్కల కట్టం సందచేలకి అయిదో పదో కళ్ళ సూపిత్తాయిబావూ!-"

నారాయణ స్వగతం చెప్పుకుపోతూనే ఉన్నాడు. మూర్తి మౌనంగా ఊ కొడుతూనే ఉన్నాడు. చలిగాలి మరింత ఎక్కువయింది. మూర్తి రిక్షాలో మునగదీసుకుని కూర్చున్నాడు. అక్కడ దారి మరీ జీబురుగా ఉంది. నారాయణ ఆయాసపడుతూ రిక్షాను వేగంగానే తొక్కుతున్నాడు. రోడ్డు కిరువైపులా

దొంకలు, ముళ్ళపొదలు.. ఆకాశంలో క్షీణచంద్రుడు అప్పుడే బయటకొచ్చాడు. వెన్నెల - వెలుగు దారిలో పలచగా పరుచుకుంటోంది ఎక్కడో నక్కలు కూస్తున్నాయి....

"బావూ!" నారాయణ గొంతు విని ఎటో చూస్తున్న మూర్తి అదిరిపడ్డాడు. ఆ చీకట్లో ముందుకు దృష్టిని సారించే సరికి రిక్షా ఎత్తైన ప్రదేశాన్ని ఎక్కుతూ ఆగిపోయింది. అక్కడ ఏదో చిన్న వంతెన ఉన్నట్లుంది .. క్రింద కాలవలో నీళ్ళు గలగలమంటూ శబ్దంచేస్తున్నాయి. నారాయణ ఒక చేత్తో హేండిలు పట్టుకుని, రిక్షా దిగిపోయి రోడ్డుమీద కూర్చుండిపోయాడు. ఏం జరిగిందో అర్థంకాక మూర్తి గభాలున రిక్షాలోంచి దూకి ఒకచేత్తో నారాయణని, మరో చేత్తో రిక్షాని బలంగా పట్టుకున్నాడు. "నారాయణా! ఏం జరిగింది?" మూర్తి ఆదుర్దాగా అడిగాడు.

"బావూ! గుండెల్లో నొప్పి.... అప్పుడప్పుడు అట్టాగే వత్తదయ్యా! పర్నేదు వొక్క చెనం కళ్ళు మూసుకుంటే తగ్గి.... అబ్బా...." నారాయణ మాట్లాడలేకపోతున్నాడు. బాధతో విలవిల లాడుతూ గుండెమీద చెయ్యిపెట్టుకొని వెనక్కి ఒరిగిపోయాడు- రోడ్డుమీద వెల్లకిలా పడుకుండిపోయాడు. మూర్తికి మతిపోయినట్టయ్యింది. ఒక్కసారే ఒంట్లో దడ, కంగారు పుట్టాయి. చుట్టూ చీకటి.... నిర్మానుష్య ప్రదేశం.... ఏం చెయ్యడానికి పాలుపోలేదు. 'నారాయణా! నారాయణా!' అంటూ రెండుసార్లు గట్టిగా పిలిచాడ. నారాయణ మాట్లాడలేదు.... నాడి పరీక్షించి చూశాడు. ఊహూఁ! అది కొట్టుకుంటున్నట్లుగా కనిపించలేదు. మూర్తి నారాయణ తలని తన ఒళ్ళో పెట్టుకుని గుండెలమీద బాగా రుద్ద సాగాడు. పది నిమిషాలు మూర్తి అలా రుద్దేసరికి నారాయణ కొద్దిగా మూలిగాడు. అయినా మాటకు బదులు చెప్పలేకపోతున్నాడు. మూర్తి నారాయణని అలా రోడ్డుమీద పడుకోబెట్టి రిక్షాకున్న కిరోసిన్ దీపం చేత్తో పట్టుకున్నాడు. నెమ్మదిగా రోడ్డుగట్టు దిగి వంతెన క్రింద కాలవలో జేబురుమాలు తడిపి దారికడ్డంగా ఉన్న మొక్కల్ని తప్పించుకుంటూ పైకి వచ్చాడు. ఆ తడిగుడ్డతో నారాయణ ముఖం చాలా సేపు తుడిచాడు. అయినా నారాయణ పరిస్థితిలో మార్పులేదు. ఇప్పుడేమిటి చెయ్యడం? మూర్తి మళ్ళీ నారాయణ గుండెలమీద రాస్తూ కూర్చున్నాడు. నిముషాలు గడుస్తున్నాయి. ఫలితం కనిపించలేదు....

వీడికి గుండెజబ్బని ఊహించనైనా లేదు. ఎలా ఊహించగలడు? మనిషి బలంగానే ఉన్నాడు. రిక్షా ఎక్కినప్పట్నుంచి ఏవో కబుర్లు చెబుతూనే ఉన్నాడు. ఒకవేళ జరగకూడనిది జరిగి

.... వీడిక్కడ అర్ధాంతరంగా ప్రాణం వదిలేస్తే ఆ పాపం తనకు చుట్టుకోదూ! పాపపుణ్యాల ప్రసక్తి వదిలేసినా మనిషిగా తనిప్పుడు ఏం చెయ్యగలడు? ఆతని భార్యకు అప్పగించేద్దామనుకుంటే చాలా దూరం వెనక్కి వెళ్ళాలి. ఎలా తీసుకువెళ్ళగలడు తను? ఉహూఁ పోనీ నారాయణని వదిలేసి వెళ్ళిపోతే! అవును తను వెళ్ళాలి తప్పదు. ఇప్పటికే చాలా ఆలస్యమయింది.... మరి నారాయణ సంగతి? మూర్తి ఒక్కసారి కళ్ళు మూసుకున్నాడు. నారాయణ భార్య మనసులో మెదిలింది వాళ్ళ అనుబంధం, ఆత్మీయత గుర్తుకొచ్చాయి. ఏదో నిర్ణ యించుకున్నవాడిలా దిగ్గున లేచాడు మూర్తి నారాయణ చంకలో రెండు చేతులూ పెట్టి, ఎత్తిపట్టుకుని రిక్షాలో పడుకోబెట్టాడు. హేండిలు పట్టుకుని రిక్షాను ముందుకు నడిపించసాగాడు. అలవాటులేని పని. ఆటూ ఇటూ హేండిలు విసురుతూంటే జాగ్రత్తగా కాస్తూ రిక్షాను ముందుకు లాగుతున్నాడు. మూర్తికి కాళ్ళు తడబడుతున్నాయి. కళ్ళు దారిని జాగ్రత్తగా గమనిస్తు న్నాయి. ఇంతదూరం వరకు తనను రిక్షాలో కూర్చోబెట్టి నారాయణ లాక్కొని వచ్చాడు. ఇప్పుడు అదేపని తను చేయ వలసి వచ్చింది.ఎంతలో ఎంత విచిత్రం! జీవితంలో ఎన్నడూ ఊహించని సంఘ టన యిది. ఈ చీకట్లో నిర్జన ప్రదే శంలో ఒక అభాగ్యుణ్ని అపస్మారక స్థితిలో రిక్షాలో మోసుకువెళ్ళడం.... మూర్తికి తన ఉద్యోగం.... స్థితి ప్రస్తుత పరిస్థితి అన్నీ మనసులో మెది లాయి. వాట్ ఎ మిజరబుల్ ఇన్సిడెంట్! అనుకున్నాడు. రిక్షాను వేగంగా ముందుకు లాగుతూంటే మూర్తి ఒళ్ళంతా చెమటపట్టేసింది. అంత చలి లోను తొడుక్కున్న బట్టలు తడిసి పోయాయి....

దూరంగా అక్కడక్కడా దీపాలు మిణుకుమిణుకుమంటూ కనిపించాయి. ఊరు దగ్గరకొచ్చేసింది. మూర్తి ఓపిగ్గా రిక్షాను ముందుకు లాగుతున్నాడు. రిక్షా మలుపు తిరిగింది. రోషమ్మగుడి దాటింది. రోషమ్మ ఆ వూరి దేవత.... ప్రతియేటా పెద్దఎత్తున జాతర జరుగు తుంది. ఆ గుడి దాటితే రోడ్డుప్రక్కనే పెద్ద చెఱువు! చెఱువు గట్టుమీద వరుసగా నాటిన కొబ్బరిచెట్లు.... ఆ ప్రక్కనే చెన్నకేశవస్వామి ఆలయం .... ఇంకా ముందుకుపోతే చిన్నపిల్లలబడి. అన్నీ మామూలుగా అనవాలు పట్టాడు మూర్తి. ఊరు నిశ్శబ్దంగా నిద్రపోతూంది. చెన్నకేశవస్వామి ఆలయంవద్ద వెలుగులో చేతివాచీవంక చూశాడు. టైము ఒంటిగంటన్నర.... రిక్షాను ముందుకు లాక్కెళ్ళి చిన్నపిల్లల బడి వెనుక వీధిలో నిలిపాడు. ఒక నిముషం ఆ వీధిని పరీక్షగా చూసి....

వీధిలైటు వెలుగులో చక్రవర్తుల శేషావతారం, ఆర్.ఎమ్.పి. అన్న బోర్డుని చూసి ఆ యింటిముందు రిక్షాను ఆపాడు. గబగబా యింటి మెట్లెక్కి 'శేషావతారంగారూ' అంటూ గొంతెత్తి బిగ్గరగా పిలిచాడు. శేషావతారంగారు ఆయుర్వేదంలో పడిపోయి అంగ్ల వైద్యంలో ఆరితేరిన దిట్ట. కొద్ది సేపట్లోనే తలుపు తీసిన చప్పుడయింది. శేషావతారంగారు చేతిలో లాంతరుతో 'ఎవరూ!' అంటూ బయటకొచ్చారు దీపం వెలుగులో మూర్తిని చూసి– "అరె! నువ్వటోయ్ మూర్తి! ఇదే రావడమా!" అంటూ ఆశ్చర్యాన్ని కుమ్మరించారు.

"అవునండీ! ప్రయాణం త్వరగా జరుగలేదు. దారిలో ఈ రిక్షావాడు గుండెనొప్పంటూ పడిపోయాడు. అతన్నక్కడ వదిలివేయలేక రిక్షాలో వేసుకుని లాక్కొచ్చాను" మూర్తి రిక్షాలో నారాయణని చూపిస్తూ సూట్ కేస్ బయటకు తీసుకున్నాడు.

"అరెరె! ఎంత పని జరిగింది! సర్లే వీడి సంగతి నేను చూస్తాను.... నువ్వు త్వరగా ఇంటికెళ్ళు" శేషావతారం రిక్షాలోని నారాయణ నాడి పట్టుకుని పరీక్షించాడు.

"ఫరవాలేదు.... వీడికి వైద్యం నేను చేస్తాను.... నువ్వెళ్ళు–" అక్కడే ఇంకా నిలబడిఉన్న మూర్తిని కంగారు పెట్టారు శేషావతారంగారు. మూర్తి వెనక్కి తిరిగి గబగబా అడుగులువేసి మున్సబుగారి వీధిలోకి మళ్ళి... అక్కడ నుంచి నాలుగంగలు వేసి.... పరుగెడుతున్నట్టుగా నడిచి తన యింటిముందు వాకిట్లో వాలాడు.... ఇంటిముందు పంచలో నూనెదీపం వెలుగుతూంది.... గుంపుగా కూర్చున్న ఆడవాళ్ళందరూ ఒక్కసారే గొల్లుమన్నారు....

"బాబూ! ఇప్పుడొచ్చావా నాయనా! అంతా అయిపోయింది– బాబూ అంతా అయిపోయింది. కళ్ళల్లో ప్రాణం ఉన్నంతవరకూ నీ పేరే కలవరిస్తూ పోయాడు బాబూ నీ తండ్రి! కనీసం కడసారి చూపులైనా దక్కలేదు నాయనా నీకు.... ఎంత దౌర్భాగ్యం తండ్రీ! ఒక్క అరగంట ముందుగా వచ్చినా నీ తండ్రి ముఖాన్ని చూసుకోగలిగి ఉండే వాడివి నాయనా!" మూర్తి సూట్ కేస్ క్రిందపడేసి ఏడుస్తూ పెద్దగా శోకాలు పెడుతూన్న పెద్దమ్మను పట్టుకుని బావురుమన్నాడు.... మరుక్షణం ఏదో ఆలోచన మెరుపులా మెరిసినట్లయి, పెద్దమ్మను వదిలించుకుని శ్మశానంవైపు పరుగెట్టాడు....

అవును.... తన తండ్రిని కడసారి ముఖం చూసుకోలేకపోయాడు. ఎంత దౌర్భాగ్యం? నిన్న సాయంకాలం టెలిగ్రాం అందింది. "ఫాదర్ ఎక్స్పైర్డ్ .... స్టార్ట్ ఇమ్మీడియట్‌లీ!" అని. ఒళ్ళు కంపిస్తుంటే.... దుఃఖం

తెరలుతెరలుగా ఎగదన్నుకొస్తూంటే తనను తాను ఓదార్చుకుని వెంటనే బయలుదేరాడు. కాని ఎంత తొందరగా వద్దామన్నా అనుకున్న సమయానికి రాలేకపోయాడు! హుం.

తన తండ్రి తనకు తండ్రి కాదు.... తల్లి, గురువు, దైవం అన్నీ తనై పెంచాడు చిన్నప్పుడే తల్లి పోతే-మరో పెళ్ళిమాటెత్తక మోడువారిన చెట్టులా మిగిలిపోయాడు. గోరుముద్దలు తినిపించాడు. జోలపాడి నిద్రపుచ్చాడు... భుజాలమీద ఎత్తుకుని బడికి తీసుకెళ్ళాడు .... ఆశలు అన్నీ తనపై పెట్టుకుని ఉన్న అయిదెకరాల పొలం అమ్మి పై చదువులు చదివించాడు. ఉద్యోగం వచ్చిన తరువాత ఎన్నిసార్లు తనవద్దకు రమ్మన్నా రాకుండా ఉన్న ఊళ్ళోనే తనకు హాయిగా ఉంటుందని మొరాయించి.... నువ్వు పెళ్ళిచేసుకుని ఒకరో ఇద్దరో పిల్లల్ని కన్న తరువాత వచ్చి వాళ్ళతో ఆడుకుంటానని సర్దిచెప్పి పంపించేసే వాడు. తన పెళ్ళి కళ్ళచూడకుండానే వెళ్ళిపోయాడు. ఆర్నెల్ల క్రితం తను గోవా ట్రైనింగు కెళ్ళాడు. నెలరోజుల క్రితమే ఆఫీసరుగా ప్రమోటయ్యాడు. తను ఎప్పటికప్పుడు ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు. తండ్రిదగ్గర్నుంచి కూడా జవాబులు వస్తూనే ఉన్నాయి. కాని.... తన తండ్రి తనకు అన్యాయం చేశాడు. తన అనారోగ్యాన్ని కప్పిపుచ్చి అర్ధాంతరంగా వెళ్ళిపోయాడు....

మూర్తి పిచ్చెక్కినవాడిలా పరిగెడుతూ వచ్చి శ్మశానంలోకి అడుగు పెట్టాడు. అక్కడ కూర్చున్న బంధువులంతా ఉలిక్కిపడి మూర్తిని గుర్తించి ఒక్కొక్కళ్ళే దగ్గరగా చేరి ఓదార్చడం మొదలుపెట్టారు. ఎదురుగా.... కట్టెల మీద.... భగ భగ మండుతూన్న మంటల్లో.... తన తండ్రి బూడిదగా మారిపోతూన్న తన ఆత్మబంధువు.... అతడ్ని కడసారి చూడలేకపోయి.... కనీసం తలకొరివి పెట్టలేకపోయిన దౌర్భాగ్యం! దురదృష్టం! మూర్తి దుఃఖానికి అంతులేదు.... కుప్పలా కూలిపోయాడు ...

* * *

ఉదయం.... అప్పుడే తూర్పు తెల్లబడుతూ తెలతెలవారుతోంది. బంధువులతో కలిసి శ్మశానంనుంచి ఇంటికి తిరిగివస్తున్నాడు మూర్తి. అందరూ శేషావతారం ఇంటిముందుగా నడుస్తున్నారు. అక్కడే నిలబడిఉన్న రిక్షాను చూసి గబగబా గుమ్మంఎక్కి అరుగు మీదకు వెళ్ళాడు మూర్తి. మూర్తిని చూసి శేషావతారంగారు బయటకొచ్చారు.

"మూర్తీ! నువ్వుగాని ఈ నారాయణ గాడ్ని ఆ విధంగా రిక్షాలో వేసుకుని రాత్రి నాకు అప్పగించకపోతే వీడికి ఈపాటికి భూమ్మీద నూకలు చెల్లిపోయి ఉండుననుకో! వీడికి గుండెజబ్బు....

పెద్ద షాక్ వచ్చింది. నీకు నాకు తెలుసు. రిక్షా తొక్కొద్దని, బరువు పనులు చెయ్యొద్దనీ గతంలో చాలా సార్లు హెచ్చరించాను ఎలాగైతేనేం, ఒడ్డున పడ్డాడనుకో! నిజానికి నారాయణకి ప్రాణదానం చేసింది నువ్వే! నీ తండ్రి పోయాడని తెలిసి అంత దుఃఖంలో ఉండికూడా వాడ్ని రిక్షాలో లాక్కొని వచ్చావే! నిజంగా వాడికి పునర్జన్మ ఇచ్చావు.... మహామహులకే సాధ్యం కానంత సంయమనాన్ని, సంస్కారాన్ని ప్రదర్శించేవు"....

శేషావతారంగారు చెబుతూన్న మాటలు మూర్తికి తలకెక్కటంలేదు. "బాబూ! ఓ అరగంట ముందుగా వచ్చినా నీ తండ్రి కడసారి చూపులు నీకు దక్కేవి!" అన్న పెద్దమ్మ మాటలే గుర్తుకొస్తున్నాయి.

అవును.... నారాయణని అక్కడే వదిలేసి వెంటనే వచ్చేస్తే కనీసం తన తండ్రిని చూడగలిగేవాడేమో! అతనికి తలకొరివి పెట్టగలిగేవాడేమో! తన తండ్రి శవమై తనకోసం ఎదురుచూస్తున్నాడని తెలిసి కూడా.... నారాయణని వదిలిపెట్టి ఎందుకు రాలేకపోయాడు? ఏ శక్తి తన కాళ్ళకి అడ్డంపడింది.... తను తప్పుచేశాడా? అది నిజంగా తప్పే అయితే తన తండ్రి మనసు శాంతిస్తుందా? తనను క్షమించగలుగుతుందా?

మంచంలో నారాయణ నెమ్మదిగా లేచి రెండు చేతులెత్తి దణ్ణం పెడుతూ మూర్తికాళ్ళమీద పడిపోయాడు.

"బాపూ! మీ ఋణం నా జనమలో తీర్చుకోలేను. మీరు మనుషులు కాదు... నా పాలిట...." మూర్తి నారాయణని గభాలున పట్టుకుని పైకి లేపి అతని ముఖంలోకి చూస్తూండిపోయాడు.... అలా చూస్తుంటే నారాయణ ముఖంలో ఎవరో కనిపించినట్లయ్యింది... అతనికి ఇప్పుడు జన్మనిచ్చిన తండ్రిని చూడలేకపోయానన్న బాధలేదు. బెంగ లేదు. మూర్తి నారాయణని గుండెలకి హత్తుకున్నాడు. వాళ్ళిద్దర్నీ చూస్తూ వసుధైక కుటుంబం- మానవతా! చిరంజీవ! అంటూ శేషావతారంగారు మనసులో ఒకటికి పదిసార్లు అనుకుంటూ ఉండిపోయారు.